# కొక్కొరొక్కో

## "నంద"



సూర్యుడు పశ్చిమాద్రిలోకి జారుకుంటున్నాడు.

వడివడిగా వెళుతున్నాడు శ్రీరాం ఆ వీధిలో. తలెత్తి ఎటువైపూ చూడ్డం లేదు. ఆ వీధంటే శ్రీరాంకు ఎచ్చదు. కాని తప్పని పరిస్థితియై వెళుతున్నాడు. ఎప్పుడూ, చుట్టూ అయినా మెయిన్‌రోడ్‌లోనే ఇంటికి వెళ్ళేవాడు.

అలసిపోయాడు శ్రీరాం. చుట్టూతా వెళ్ళలేక, అంత దూరం నడిచే ఓపిక లేక, దగ్గరి దారని ఆ వీధిలో వెళుతున్నాడు.

"వస్తారా ?"

శ్రీరాం తలెత్తలేదు.

"ఏమండీ ! వస్తారా ?" మళ్ళీ పిలిచిందో గొంతు.

అయినా అటువైపు చూడలేదు. వేగంగా మరో నాలుగడుగులు వేశాడు.

"ఇలా రండి!"

కొంచెం ముందుకు వెళ్తానే వెనక్కు చూశాడు. వాకిళ్లలో నిలబడి చూస్తున్నారు అమ్మాయిలు.

తల వెనక్కు తీసుకొని నడవసాగాడు. సందు మలుపు వచ్చింది.

"ఏమండీ ! వస్తారా ?" అన్న పిలుపు హఠాత్తుగా దగ్గరలో వినబడింది.

తలెత్తి చూశాడు శ్రీరాం.

ఓ పదునెనిమిది సంవత్సరాల అమ్మాయి నిలబడి తనవైపే చూస్తున్నది. తను తలెత్తడం చూసి కిసుక్కున నవ్వింది. ఎందుకో శ్రీరాంకు మాట్లాడాలనిపించింది. ఏదో తెలియని మమత అంకురించింది. ఆమె ముఖంలో పసితనం గోచరించింది. అందుకే ఆగాడు.

"ఏమండీ మిమ్మల్నే. ఇలా రండి," అందా అమ్మాయి అదో మాదిరిగా చూస్తూ. "వెళదామా ! వద్దా !" అన్న సందిగ్ధానంతో అలాగే నిలబడి ఆలోచించసాగాడు శ్రీరాం. చివరికి వెళ్ళడానికే నిర్ణయించుకున్నాడు.

ఆమెవైపు కదిలాడు. ఇంటిలోకి వెళ్ళింది. వెనుకనే తనూ వెళ్ళాడు ఇంటిలోకి. ఆమె మంచామీద కూర్చుంటూ "వచ్చి ఇలా కూర్చోండి" అంది.

అలాగే నిలబడి ఇల్లంతా ఓసారి కలయ చూశాడు. గది చిన్నదిగా ఉంది. గోడలకు సున్నం వేసి ఎన్నాళ్ళయిందో, గోధుమ కలర్‌లో ఉన్నాయి. ఓవైపు బట్టలు వేసి ఉన్నాయి

దండెంకు. మంచంవైపు చూశాడు. మాసి ఉన్న దుప్పటి పరచి ఉంది. ఓ వైపు రెండు దిళ్ళు నూనెజిడ్డుతో నల్లగా ఉన్నాయి.

అమ్మాయి వైపు చూశాడు. బ్లూ నైలెక్స్ చీర కట్టింది. అదే రకం జాకెట్ తొడుక్కొని ఉంది. వయసుకు పదునెనిమిదే ఉన్నా ఇంకా పెద్ద వయస్సమ్మాయిలాగ కనబడుతోంది. అంతలావూ కాదు సన్నమూ కాదు. సుమారు నాలుగడుగుల ఏడంగుళాల పై ఉంటుంది. మనిషి పుష్టిగా ఉన్నా, కళ్ళక్రింద కనీకనిపించని నల్లటి పొర ఏర్పడి ఉంది. ముఖానికి పౌడర్ అంటించి ఉంది.

"ఏమిటి ఆలోచిస్తున్నారు. తొందరగ రండి" తొందరచేస్తూ పిలిచింది. మూలకు ఉన్న స్టూలు దగ్గరకెళ్ళి దానిపై కూర్చున్నాడు శ్రీరాం.

"ఎందుకు అక్కడ కూర్చున్నారు? ఇక్కడకి రారా!" సందేహంగా అడిగింది అమ్మాయి.

"వద్దు. ఇక్కడే కూర్చుంటాను" అన్నాడు ఆ అమ్మాయివైపు చూస్తూ.

"మరెందుకు వచ్చారు?" అడిగింది కాస్త కోపంతోకూడిన గొంతుతో. "వచ్చిన బేరం ఇలాంటిదేంరా బాబూ. డబ్బు గిట్టుబాటు అయ్యేటట్టుగా లేదు" అనుకుంది మనస్సులో.

"నీతో మాట్లాడాలని వచ్చాను."

"మాట్లాడ్డానికైతే బయట చాలామంది దొరుకుతారు. ఇక్కడిదాకా ఎందుకు రావాలి?" ప్రశ్నించింది ఇతనెక్కడి మనిషను కుంటూ.

"నీవనుకున్నట్లుగా ఆ ఉద్దేశ్యంతో రాలేదు. పోతే బయట నీలాంటి అమ్మాయిలు కనబడరు. కనబడినా మాట్లాడ్డం కుదరని పని. అందుకే నిన్ను కొన్ని ప్రశ్నలడుగుతాను. సరిగ్గా సమాధానం చెప్పు చాలు" అంటూ జేబులోనుండి రెండు పదులు తీసి "ఇదిగో అమ్మాయ్ తీసుకో" అన్నాడు చేయి చాపుతూ.

ఆమె ముఖం సంతోషంతో వెలిగిపోయింది. చిరాకు మాయమయ్యింది. మంచంమీదనుండి లేచివచ్చి డబ్బు తీసుకుంది. "అడగండి" అంది వెళ్ళి మంచం చివర కూర్చుంటూ.

"నీపేరేమిటి? మీదే ఊరు?"

"ఉమా! మావూరు వెంకటగిరి. చిన్న ఎల్లెటూరు."

"నా వూరు పేరుతో ఇతనికేంటో!" అయినా ఈ వృత్తిలో ఉన్న మాలాంటి వారికి అసలు పేర్లు ఊర్లు ఎప్పుడో మారిపోయి ఉంటాయి. అమ్మ "రంజనీ" అంటూ ఎంత మధురంగా పిలిచేది. ప్చ్! తనకా అదృష్టం లేదు. నిజానికి వూరు వెంకటగిరి కాదు. సత్తెనపల్లి, అనుకుంది మనస్సులో.

"మీ వారెవరయినా ఉన్నారా?"

"ఎవ్వరూ లేరు"

"హుఁ! అందరూ ఉన్నా లేనిదాన్ని. వారి ఆప్యాయత, అనురాగం అందుకోలేని దురదృష్టవంతురాల్ని. ఇదంతా చేజేతులా చేసుకున్న ఫలం అనుభవిస్తున్నది తను," మనస్సులో అనుకుంటూ కళ్ళల్లో నీరు రాగా కొనగోటితో తుడుచుకుంది.

"అయితే ఎలా ఈ వృత్తిలో చేరావు?" అడిగాడు శ్రీరాం. ఆ అమ్మాయి కళ్ళు తుడుచుకోవడం చూసి "పాపం! గతాన్ని జ్ఞాపకం చేశాను. అయినా తప్పదు" అనుకున్నాడు.

మెల్లగా ప్రారంభించింది. "నాకు పట్టణాలు అంటే ఇష్టం. ఎప్పుడు పట్నంలో ఉండాలని అనుకునేదాన్ని. ఒకనాడు సినిమా చూడ్డానికి నా స్నేహితురాలు, నేను పట్నం వెళ్ళాం. సినిమా చూస్తున్నాం. ఇంతలో గలాటా జరిగింది. పోలీసులు వచ్చారు. అంతా గలబాగా ఉంది. ఆ హడావుడిలో బయటికి పరుగెత్తాను.అంతా చీకటి. లైట్లు లేవు. నా చేయిఎవరో పట్టుకొని పరుగెత్తు అన్నారు.

నా స్నేహితురాలనుకొని పరుగెత్తాను. ఆయాసం వచ్చి ఓ లైటు స్తంభంకాడ నిలబడి, న చేయి పట్టుకున్నవైపు చూసి ఉలిక్కిపడ్డాను. ఎవరో అమ్మాయి. నాకు తెలియదు.

"ఎవరు నీవు? మా కమలేది" అడిగాను భయంగా.

"నీ ప్రక్కన కూర్చున్న అమ్మాయి కదూ! అయితే మా చెల్లెలు పట్టుకొని ఉండగా చూశాను సినిమాలో. మా యింటి దగ్గిరుంటుంది, వెళదాము పద" అందా అమ్మాయి.

నేను ఆమె వెంట వెళ్ళాను. ఓ యింటికి తీసుకవెళ్ళింది. వాకిట్లోనే ఓ యిద్దరు మగాళ్ళు అదోలా చూస్తూ వెళ్ళారు. నాకు భయం పట్టుకుంది. నా స్నేహితురాలు లేదక్కడ. అది 'సానికొంప'ని తర్వాత తెలుసుకున్నాను. నన్ను నిర్బంధించి నాశనం చేశారు. అక్కడినుండి తప్పించుకోవాలని ప్రయత్నించాను. ఫలితం వాళ్ళు హూనమయ్యేట్లుగా చావబాదారు. అలా ఇందులోకి ప్రవేశించాను. ఏ ముఖం పెట్టుకొని ఇంటికెళ్ళాలి. ఒకటిన్నర సంవత్సరమయ్యింది ఈ జీవితం సాగించి." అంటూ తనగురించి చెప్పడం ఆపింది.

"చూడమ్మాయ్! ఇంత కాలం ఈ బ్రతుకు బ్రతికావు. ఇలా ఎంత కాలం గడుపుతావు. నీయొక్క హంగు పొంగు ఉన్నంతవరకు బ్రతుకు గడుస్తుంది. నీకంటూ ఓ జీవితం ఉండదు. ఆ తర్వాత నీ జీవితం ఏమిటి అని ఆలోచించావా?"

శ్రీరాం మాటలు విన్న తర్వాత ఆత్మ విమర్శ చేసుకోసాగింది ఉమ.

'ఏమిటి! తనకొక బ్రతుకా!? ఇంతవరకు ఆలోచించలేదే! రాత్రిళ్ళు మత్తులో ఒళ్ళప్పగించి డబ్బు సంపాదించుకోవడం, ఉదయం ఏ పన్నెండుకో నిద్ర లేవడం, కాలకృత్యాలు తీర్చుకొని భోజనం చేయడం, ఆ తర్వాత మళ్ళీ మామూలు జీవితం సాగించడంతోనే గడిచిపోతున్నాయి రోజులు. ఈయిన అడిగేంత వరకూ తన బ్రతుకేమిటో, తనేమయిపోతానో ఆలోచించలేదు ఈనాటివరకు., మనసులో పేరుకపోయిన అజ్ఞానపు పొరలు మెల్ల మెల్లగా కరిగిపోసాగాయి. వాస్తవం తెలును కొనేసరికి వణికిపోయింది ఉమ.

అవును! ఈ బాబు ముందు తను బ్రతుకుతున్న తుచ్ఛమైన జీవితం చెప్పి మనసులోని బరువు దించుకోవాలి.

"బాబు! మీరడిగేంతవరకు ముందేమిటి? అని ఆలోచించలేదు. కాని ఈ బ్రతుకులో ఒకటిన్నర సంవత్సరం అవధిలో ఎందరినో చూశాను. మొదటిలో అదోరకం మత్తులో గడిచిపోయాయి రోజులు. ఆ తర్వాత విసుగు పుట్టింది. కొందరు నీచాతినీచంగా నాతో గడిపేవారు. ఆ బాధను మరచిపోవాలని త్రాగుడు కూడా అలవాటు చేసుకున్నాను. ఒక్కోసారి అనిపించేది – ఇలాంటిబ్రతుకు బ్రతికేకన్నా చస్తే మంచిదని.

కాని బాబూ! చావడానికి కూడా ధైర్యం కావాలి. ఆ పని చేయడానికి ధైర్యం చాలేది కాదు. అందుకే చావలేక బ్రతుకుతున్నాను. ఈ వృత్తిలో అమాయకులను, మామూలు మనుషులను, దుర్మార్గులను ఇలా ఎంతో మందిని చూశాను. కాని ఒక్కరూ .. ఒక్కరూ మీలా నిలదీసి 'ఏమిటి ఈ బ్రతుకు? ముందు నీ జీవితం ఏమిటి?' అని అడిగే వారు లేకపోయారు.

బాబూ! ఈ బ్రతుకు చాలా ఘోరం బాబూ! మాలాంటివారికి రాని సుఖవ్యాధు లంటూ ఉండవు. వాటిని పోగొట్టుకోడానికి ఎంతో డబ్బు ఖర్చు చేసుకొనేవాళ్ళం. నిండా ముప్పై ఏళ్ళు కూడా నిండని ఇద్దరు ముగ్గురిని చూశాను. వారి జీవితాలు చితికి పోయి రోగాలతో బ్రతుకు ఈడ్చలేక హీనంగా చూపబడుతూ, దౌర్భాగ్యంగా చచ్చారు. అబ్బా! తలుచుకుంటే ఇప్పటికీ ఒళ్ళు గగ్గుర్లుపొడుస్తాయి. అప్పుడు అంతగా పట్టించుకోలేదు.'' చెప్పి ఆగింది. లేచివెళ్ళి మూలనున్న కుండలో నీళ్ళు ముంచుకొని త్రాగింది.

మళ్ళీవచ్చి మంచంపై కూర్చొని ప్రారంభించింది.

''బాబూ! అప్పుడు నాకా సంఘటన, దాని పరిణామం తెలిసింది కాదు. ఇప్పుడు మీరు — తర్వాత నీ జీవితం ఏమిటి? అడిగేంత వరకూ నాకు తెలిసింది కాదు.

వద్దు బాబూ! ఏ ఆడదానికీ ఈ నరకం వద్దు. కాలుజారితే ధైర్యంగా నిలబడి బ్రతుకు దిద్దుకోవాలి. లేదా చావనైనా చావాలి.

బాబూ! నేను ఈ జీవితం నుండి బయటకు వస్తే మంచిగా బ్రతకడానికి అవకాశం దొరుకుతుందంటారా?'' అడిగింది ఆతృతగా, ఆశగా.

''చూడమ్మా! ఈ సంఘం మొదట నీలాంటివారిని చూసి కుక్కలా అరుస్తుంది. ఎదురుతిరిగి తరిమితే పారిపోతుంది. అలాగే నీవు మనస్ఫూర్తిగా మారగలిగితే, నీవు బ్రతకడానికి నేను సహాయం చేయలేకపోవచ్చు. కాని బ్రతికే దారిమటుకు చూపగలను.

నాకు తెలిసిన ఓ ధర్మాత్ముడు ఉన్నాడు. చాలా దూరంలో, మారుమూల పల్లెలో ఊరికి చివరగా చిన్న ఆశ్రమం లాంటిది ఏర్పాటుచేసి, దారి తప్పిన నీలాంటివారికి చేయూత నిస్తున్నాడు.

అక్కడ ఎవరికి తెలిసిన పనులు వారు చేస్తుంటారు. చదువు రానివారికి చదువు నేర్పించి, విశాల విశ్వంలో స్వతహాగా బ్రతకడానికి ధైర్యం కలిగిస్తారు.

నీకు వెళ్ళాలని, ఈ బ్రతుకు మరచిపోవాలని, మంచి మనిషిగా మారాలని ఉంటే అక్కడికి వెళ్ళేందుకు అడ్రస్సు ఇస్తాను. వెళితే వెళ్ళు. లేదా నీ యిష్టం.'' చెప్పడం ఆపి జేబులోనుండి డైరీ తీసి అడ్రసు వ్రాసి, రెండు పదుల నోట్లు తీసి ''ఇదిగోనమ్మా

## కొక్కొరొక్కో

అడ్రసు, ఖర్చుకు డబ్బు'' అంటూ చేయి చాపాడు.

ఆమె లేచి మౌనంగా అందుకుంది అడ్రసు కాగితాన్ని, డబ్బును.

లేచాడు శ్రీరాం. ''వస్తానమ్మా, ఆ దేవుని ఆశీస్సులు ఉంటాయని ఆశిస్తున్నాను. వస్తాను. మంచి జీవితాన్ని కోరుకో. మనసులోని మాలిన్యాన్ని శుభ్రపరచుకొని మల్లెపూవులాంటి మనస్సుతో నీ ఆశయం ప్రారంభించు. వెళ్ళొస్తాను. మళ్ళీ ఎప్పుడు కలుసుకోవాలో ఆ దేవుని నిర్ణయం ప్రకారం జరుగని'' అంటూ బయటికి వచ్చాడు.

## సొంత డబ్బా!

నీ కంటి గ్లాసులో
ప్రపంచ సముద్రాన్ని
గిరగిరా తిప్పేస్తావ్.
నీ గుండె కంటితో
ముల్లోకాల అంచుల్నీ
ముడివేస్తావ్!
నీ గదిలో నువు తిరుగుతూనే
జగాలను మేల్కొల్పుతావ్
సుఖదుఃఖా ద్యనుభూతులకు
అక్షరాల ఆహారం—అందంగా తినిపిస్తావ్
కవీ — నువ్వే నువ్వు —
నీ జన్మే — జన్మ...

— అడబాల

అతని వెనుకనే ఆమెకూడా వచ్చింది. వాకిలిలో నిలబడి అతను వెళ్ళేవైపే చూస్తూ ''ఎంత గొప్ప హృదయం!'' ఓ అభాగ్యురాలి కష్టగాథ విని చేయూత నివ్వడానికి ప్రయత్నిస్తున్నాడు.

మమ్ములను చూడగానే వెకిలి చూపులతో, అసహ్యమైన మాటలతో పలకరించి, తమ పని జరుపుకపోతున్నవారిని ఎంతోమందిని చూసింది తను. కాని ఇలాంటి మనిషిని చూడ్డం ఇదే మొదటిసారి

ఇలాంటివారిని చూసేనేమో ''మానవుల్లో కూడా మహనీయులు వుంటారు''ని అంటుంటారు అనుకుంటూ అతను వెళ్ళినవైపు చేతులెత్తి నమస్కరించింది.

అప్పటికే శ్రీరాం కనుమరుగయ్యాడు. ఇంటిలోకి వచ్చింది. శ్రీరాం కూర్చున్న స్టూలు వంక ఆరాధన పూర్వకంగా చూడ సాగింది. మెల్లగా స్టూలుదగ్గరికి నడిచింది. ఆప్యాయంగా చేతులతో తడిమింది హృదయం తీయ్యటి బాధతో మూలగలేదు. ఎవరినో ఆత్మీయుడిని కలుసుకున్నంత ఆనందం కలిగిందామెకు.

''చిన్నప్పుడే పెద్దవారి మాట వినక తెలిసీతెలియని వయస్సులో మొగపిల్లలతో తిరిగింది. అలాతిరుగుతూనే కన్యత్వాన్ని పోగొట్టుకుంది. అది అలవాటుగా మారి ఇంటిలోని వారికి తలవంపులు తెచ్చింది. ఆ తరువాత వారి దగ్గర ఉండలేక ఇలా దూరంగా వచ్చింది. ఉన్న ఊరిలో అభాసుపాలయి పెళ్ళి అయ్యే యోగ్యత పోగొట్టుకుంది.

ఇంటిలోనివారు ఎంతగానో ప్రయత్నించారు. తను బంహీనలకు బానిస అయి వదులుకోలేకపోయింది. చివరకు అందరూ అదోలా చూడ్డం, ఇంటిలోని వారు పరువు పోగొట్టిందన్న కోపంతో సూటి పోటి మాట లనడం సహించ లేకపోయింది.

అందుకే ఇంతదూరం వచ్చి ఈ రంగుల వలలో ఇరుక్కొని నరకం అనుభవించసాగింది ఇలాంటి నికృష్టపు జీవితాన్ని ఆ బాబుకు చెప్పలేక కట్టుకథ చెప్పింది. ఆ బాబునుండి సానుభూతి సంపాదించుకుంది. తాను చెప్పింది అబద్ధము అని ఆ బాబుకు చెప్పలేక పోయింది, చివరికయినా!''


అనుకుంటూ మెల్లగా స్టూలు ప్రక్కన కూర్చుని తల దానిపై పెట్టి కళ్ళు మూసుకుంది. అలాగే ఉండి పోయింది తృప్తిగా, హాయిగా ఉమ కాని రంజని.

* * *

కోడిపుంజు ''కొక్కొరొకో!'' అని కూసింది. ఆ అరుపుకు ఉలిక్కిపడి మేలుకుంది రంజని. తను ఎక్కడ పడుకుందో చూసుకుంది. స్టూలు ప్రక్కనే నేలపై పడుకునుంది.

''అబ్బా! ఎన్నాళ్ళయ్యింది, ఇంత మంచి నిద్రచేసి. ఇది ఇలాగే శాశ్వితంగా ఉండేలా చేసుకోవాలి. అది తన చేతిలోని పనే

అవును. ఈ ఉషోదయమే కావాలి తన బ్రతుకుకు ఆశా కిరణం. మళ్ళీ మంచి మార్గంలో పయనించాలి.




# కొక్కొరొకో

ఈ నాటితో ఈ జీవితం ఒక పీడకలలా మరచిపోవాలి. ఈనాటి నుండి తను ఉమ కాదు, రంజని.

మధ్యలో వచ్చిన ఉమపాత్ర నాటకంలోని వేషంలా, నాటకం ముగియగానే రంగు కడిగేసుకున్న పాత్రలా కడిగేసుకోవాలి.'' అనుకుంటూ గుప్పెడు తెరచింది. రెండు వడ్లు, అడ్రసు కాగితం అలాగే వున్నాయి.

వాటిని కళ్ళకద్దుకొని, శ్రీరాంను మనస్సులో తలచుకొని నమస్కరించింది. లేచి తనకున్న మంచి చీర, జాకెట్టు, ఓ రెండు జతలు తీసుకొని చేతి సంచిలో పెట్టింది. చేతిలోకి తీసుకొని తలుపు దగ్గరకు నడిచింది.

మెల్లగా తలుపు తెరిచింది. తూర్పున ఆకాశం ఎర్రని సింధూరపు రంగులో లేతగా ఉంది. బాలభానుడు తన లేత కిరణాలను పుడమిపైకి ప్రసరించడానికి ఆయత్తమవుతున్నాడు.

ఆ బాలభానుని లేత కిరణాలు మెల్ల మెల్లగా చీకట్లను పారద్రోలుతూ చొచ్చుక వస్తున్నాయి. ఆ కిరణాలు విశ్వం అంతటా పరచుకుంటున్నాయి.

లేత కిరణాలు మెల్లగా వచ్చి సోకాయి రంజనిని. మనస్సు నిర్మలంగా, స్వచ్ఛంగా ఉంది రంజనికి.

చేతులు రెండూ జోడించి బాలభానునికి నమస్కరిస్తూ ''భగవాన్ నీయొక్క ఉషోదయంలా నా బ్రతుకులో చల్లని కిరణాలు ప్రసరించాలని వేడుకుంటున్నాను. కొత్త జీవితం ప్రసాదించు'' అనుకుంది.

చేతిలో సంచితో తూర్పు దిక్కుగా నడక సాగించింది. ''కొక్కొరొకో'' అంటోంది కోడి. ఇంకా ఆ పేటలో ఎవరూ మేలుకోలేదు. రాత్రంతా అలసిన అభాగ్యులకు తెల్లవారేది ఎప్పుడో! అందుకే అంతటా నిశ్శబ్దంగా ఉంది.

రంజని ముందు నడుస్తుంటే ఆమె నీడ పాడవుగా ''నీకు అండగా, తోడుగా నేనుంటాను'' అన్నట్లుగా ఆమె వెంటనే కదలసాగింది. బ్రతుకు మీద ఆశతో ఉషోదయంలో ఉషస్సులా సాగిపోయింది రంజని. ★